క్లుప్తంగా

బహుజన రాజ్యం వస్తేనే పేదల్లో మార్పు



కల్వకుర్తి రూరల్: రాష్ట్రంలో బహుజన రాజ్యం వస్తేనే పేదల బతుకులు మారుతాయని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ యోసోఫ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో యోసోఫ్ మాట్లాడారు. ఉత్తర ప్రదేశ్‌లో బహుజన సమాజ్ పార్టీ పేదలకు చేసిన అభివృద్ధిని వివరించారు. అసెంబ్లీ ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు ఆంజనేయులు, సత్యానందం, చందు, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు శిఖం భూమిని కాపాడాలి



నాగర్‌కర్నూల్ రూరల్: మంతటి శివారులోని గార్ల చెరువు శిఖం భూమిని ఓ వ్యక్తి ఆక్రమించారని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయ అధికారి శ్రీనివాస్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. గంధం వెంకటరమణ దళితులతో కొంత భూమిని కొనుగోలు చేసి అందులో గార్లచెరువు శికం భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నారని ఆరోపించారు. సుభాష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



కొల్లాపూర్: ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేసేవారు అభినందనీయులని తహసీల్దార్ శివ శ్రీనివాస్ అన్నారు. వనిత గోల్డ్‌క్లబ్ ఆధ్వర్యంలో 42 రోజులుగా కొల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం, అంబలికేంద్రం ముగింపు సందర్భంగా బుధవారం అన్నదానం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ భోజనాలు వడ్డించారు. వనిత గోల్డ్‌క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆకుతోట సుదర్శన్‌శెట్టి, శేషయ్యశెట్టి, లక్ష్మణశెట్టి, సాయిబాబా, శ్రీనివాసులు, రాము, శ్రీదేవీ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి

కొల్లాపూర్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. దేశానికి గౌరవ, ప్రతిష్టలు పెంచిన మహిళా రెజ్లర్లపై బ్రిజ్ భూషణ్ అసభ్యకరంగా ప్రవర్తించారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరితే కేంద్రం స్పందించకపోవడం దారుణమన్నారు. శివ, నందు, శంకర్, కార్తీక్ తదితరులున్నారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం



లింగాల: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణా శిబిరం గురువారంతో ముగిసింది. శిక్షణలో వివిధ రకాల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు క్రీడలు నిర్వహించినట్లు కోచ్ అబ్దుల్లా తెలిపారు. క్రీడల్లో 25 మంది క్రీడాకారులు శిక్షణ తీసుకున్నట్లు చెప్పారు. సీనియర్ క్రీడాకారులు నవీన్, హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని మేడిపూర్‌లో జిల్లా యోజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఖోఖో వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు గురువారం నిర్వహించారు. తెలంగాణ క్రీడా ప్రాంగణంలో విద్యార్థులకు ఖోఖోతో పాటు వివిధ క్రీడలపై కోచ్ కుర్మయ్య శిక్షణ ఇచ్చారు. శిబిరంలో 30 మంది బాలబాలికలు పాల్గొన్నారు. విద్యార్థులందరికీ సర్టిఫికెట్లను అందజేశారు.



ట్రాఫిక్ సమస్య పట్టదా..?

- పట్టణంలో పార్కింగ్‌కు స్థలం కరువు
- రోడ్లపైకి వచ్చిన వ్యాపారాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు



అచ్చంపేట అంబేడ్కర్ చౌరస్తాలో నడిరోడ్డుపైనే నిలిచిపోయిన వాహనాలు

అచ్చంపేట రూరల్: పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ప్రణాళిక లోపం, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడటంతో వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా తయారైంది. పట్టణంలో వాహనాలు నిలపాలన్నా, నడపాలన్నా పెద్ద సమస్యగా మారింది. పట్టణం దినదినాభివృద్ధి జరుగుతున్నా ఆ స్థాయిలో ట్రాఫిక్ సమస్య తీర్చడానికి వసతులు లేకుండా పోయాయి. ప్రత్యేక పార్కింగ్ జోన్లు లేకపోవడంతో రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నిలుపుతున్నారు.

రోడ్లపైకి వ్యాపారాలు...

మహబూబ్‌నగర్– శ్రీశైలం, హైదరాబాద్‌కు వెళ్లడానికి ప్రధాన రహదారి పట్టణం నుంచే ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణం ప్రారంభం జీఎస్ఎన్ కళాశాల సమీపం నుంచి అటవీశాఖ కార్యాలయం వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. డివైడర్‌కు ఇరువైపుల ఉన్న రోడ్లపైకి వ్యాపారాలు రావడంతో తీవ్ర సమస్య ఏర్పడింది. తోపుడు బండ్లు, వీధి వ్యాపారులు రోడ్డుకు అతి సమీపంలో వ్యాపారాలు సాగిస్తుండటంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అలాగే దుకాణదారులు దుకాణంలోని వస్తులను బయట పెట్టడంతో సమస్యకు దారితీస్తోంది. వాహనాల సంఖ్య పెరగడంతో అక్కడక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

సమస్యాత్మక ప్రాంతాలు..

పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా, పాత బజార్‌లో రోడ్డు ఇరుకుగా ఉండటం, అక్కడే వివిధ వాహనాలు పార్కింగ్ చేయడంతో అటుగా వెళ్లాలంటేనే తీవ్ర ఇబ్బందిగా ఉంటుంది. అంబేడ్కర్ చౌరస్తాలో సమస్య తీవ్రంగా ఉంది. అక్కడే దుకాణాల ఎదుట భారీ వాహనాలు నిలపడం, లింగాల షటిల్ బస్సు అక్కడే యూ టర్న్ తీసుకుని వెళ్లడంతో వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి. నిత్యం ఈ తంతు ఇలా జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పాత బజార్‌లోని వివిధ షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా వాహనాలు నిలపడంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉప్పునుంతల రోడ్డు, లింగాల రోడ్డు, రాజీవ్‌చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, నెహ్రూ చౌరస్తా వంటి ప్రాంతాల్లో సమస్యాత్మకంగా ఉన్నాయి. రోడ్డుపై వాహనాలను నిలిపి షాపింగ్ చేయడంతో ఇతర వాహనాలు వెళ్లలేకపోవడంతో ట్రాఫిక్‌జాం అవుతుంది.

ఇప్పట్లో సమస్య తీరేనా...

గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సాహసం చేసి అంబేడ్కర్ చౌరస్తాలో, ఆస్పత్రి ముందు భాగంలో డబ్బాలు తీయించారు. కొంత వ్యతిరేకత వచ్చినా.. అక్కడి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీరింది. ప్రస్తుతం అంబేడ్కర్ చౌరస్తాలోని పోస్టాఫీసు చుట్టూ పండ్ల వ్యాపారులు, ఇతరులు కబ్జా చేసుకుని దర్జాగా రోడ్డుపైనే వ్యాపారాలు చేస్తున్నారు. అక్కడ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులు రోడ్డుపైనే నిలపడటంతో అరగంట పాటు ట్రాఫిక్ జాం అవుతుంది. పాత బజార్‌లోనూ అదే సమస్య ఉంది. పట్టణం దాటి వెళ్లాలంటే గంట సమయం పడుతుంది. అక్కడక్కడ ప్రధాన రహదారిపై, చౌరస్తాలో పోలీసులు ఉన్నప్పటికీ సమస్య అలాగే ఉంది. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో ఎవరిని కదిలించినా నష్టం జరుగుతుందనే భావనలో అందరూ గప్‌చుప్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. శ్రీశైలం మల్లన్న దర్శనానికి వెళ్లే వీఐపీలు, ఉన్నతాధికారులు అచ్చంపేట ట్రాఫిక్ జాంను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. బాధ్యత ఉన్న అధికారులైనా స్పందించి ట్రాఫిక్ జాంను నివారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయండి



కల్వకుర్తిలో మాట్లాడుతున్న చెన్నకేశవులు

కల్వకుర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని మండల పరిషత్ అధ్యక్షురాలు మనోహరా చెన్నకేశవులు, ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. 2 నుంచి 22 వరకు నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

తాడూరు: రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ సీఈఓ భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఉప్పునుంతల: మండలంలోని రైతు వేదికల్లో ఈ నెల 3న శనివారం తెలంగాణ రైతు దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారిణి సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

తెలకపల్లి: పండుగ వాతావరణంలా దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవాలని ఎంపీపీ కొమ్ము మధు అన్నారు. గురువారం స్త్రీశక్తి భవనంలో దశాబ్ది ఉత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ కొమ్ము మధు, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ భాస్కర్ పాల్గొన్నారు.



తెలకపల్లిలో అవగాహన కల్పిస్తున్న మధు

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



మంచాలకట్టలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మంచాలకట్టలో గురువారం అభయాంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు స్వామివారి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించారు. అనంతరం 11.30 గంటల సమయంలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. విరాళం అందజేసిన అతిథులను ఆలయ కమిటీ తరఫున శాలువాలతో సత్కరించి ఆంజనేయస్వామి చిత్రపటం బహూకరించారు. అందులో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, సుధాకర్‌రావు, భూంరెడ్డిరాం గోపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఉత్సవాలు

లింగాల: మండల పరిధిలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన అభయాంజనేయస్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు నేనావత్ రాజునాయక్, సర్పంచ్ దేవి సేవ్యా ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో అనేక దైవ కార్యక్రమాలు నిర్వహించారు. అభయాంజనేయస్వామి విగ్రహంతో పాటు కాశీ విశ్వేశ్వరుడు, నందీశ్వరుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉత్సవాలను తిలకించేందుకు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అట్టహాసంగా బొడ్రాయి ఉత్సవాలు



కల్వకుర్తి పూజలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి


ఉప్పునుంతల: మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని కొత్తరాంనగర్, గట్టుకాడిపల్లిలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. ఉప్పునుంతలలో బొడ్రాయితో పాటు చెన్నకేశవ స్వామి, నవగ్రహాలు, పోచమ్మలు, కేదారేశ్వరాలయంలో ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన, వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలు, అదే విధంగా కొత్తరాంనగర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపనతో పాటు ఆంజనేయస్వామి, పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన, గట్టుకాడిపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఏకకాలంలో నిర్వహించారు. అనంతరం బొడ్రాయికి పూజలు, పోచమ్మ బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉప్పునుంతలలో అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో మెలగాలి

కల్వకుర్తి రూరల్: సమాజంలో ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో మెలగాలని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కురుమిద్దెలో బొడ్రాయి ఉత్సవంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎంపీపీ మనోహరా చెన్నకేశవులు, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పాల్గొన్నారు.

ఘనంగా వీర నాగమ్మ ఉత్సవాలు

వెల్దండ: మండల కేంద్రంతో పాటు కొట్రలో గురువారం వీర నాగమ్మ దేవత ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రధాన వీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన వీరనాగమ్మ దేవతకు ప్రత్యేక బోనాలతో అలంకరించి ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. ప్రతిఏడాది ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వెల్దండలో వీర నాగమ్మ దేవత ఉత్సవాలు

ముమ్మరంగా ప్రహరీ నిర్మాణం

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం చురుగ్గా కొనసాగుతుందని సర్పంచ్ అశోక్ తెలిపారు. జూన్ మాసంలో పాఠశాలలు తిరిగి ప్రారంభం అవుతాయని, అందుకోసం త్వరితగతిన ప్రహరీని పూర్తిచేయడంతో పాటు మూత్రశాలలు, వంటగది నిర్మాణాలు పూర్తి చేసి ఆవరణలో మొక్కలు పెంచనున్నట్లు చెప్పారు.



భూ నిర్వాసితులకు పరిహారం అందించాలి



వెల్దండ: మండలంలోని గుండాల, వెల్దండ, భర్కత్‌పల్లి, బండోనిపల్లి, చెర్కూర్ గ్రామాల రైతులకు కేఎల్ఐ కాల్వలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని ఐక్యత ఎగ్జిక్యూటివ్ సభ్యులు వరప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని భర్కత్‌పల్లిలో రైతులతో కలిసి కేఎల్ఐ కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏళ్లుగా పంటలను సాగుచేస్తున్న రైతులకు కేఎల్ఐ కాల్వ ద్వారా పంట పొలాల భూములు కోల్పోయినా.. నేటికి పరిహారం అందించడం లేదన్నారు. మాజీ సర్పంచ్ రాములమ్మ, నర్సింహ, బాల్‌చెన్నయ్య, రమేష్‌నాయక్, కొండల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ పంపిణీ



వెల్దండ: మండల పరిధిలోని పెద్దాపూర్‌కి చెందిన చంద్రారెడ్డి కుటుంబానికి గురువారం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అందజేశారు. చంద్రారెడ్డి పేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్‌ఓసీని అందజేశారు. సాయికుమార్, రామస్వామి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌లో తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందిన కృష్ణయ్యగౌడ్ కుటుంబానికి గురువారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. సత్యం, మనోహర, విజయ్‌గౌడ్, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలి

మన్ననూర్: నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలోని అప్పాపూర్‌లో 3న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఉప మలేరియా అధికారి అశోక్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో వైద్య నిపుణులతో అన్నిరకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామన్నారు.

ప్రతిఒక్కరికీ గొర్రెలు పంపిణీ చేయాలి

కొల్లాపూర్: అర్హులైన ప్రతిఒక్కరికీ గొర్రెలను పంపిణీ చేయాలని కోరుతూ టీఎస్ఎస్‌జీడీసీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్‌కు కొల్లాపూర్ యాదవ సంఘం నాయకులు వినతి అందజేశారు. యాదవ యువజన సంఘం నాయకులు గంగం మల్లేష్‌యాదవ్ నేతృత్వంలో పలువురు బాలరాజుయాదవ్‌ను బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. గొర్రెల యూనిట్ల కోసం దరఖాస్తులు చేసుకున్న గొల్ల, కురువలు అందరికీ గొర్రెలు పంపిణీ చేయాలని కోరినట్లు వెల్లడించారు.



బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రానున్న శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు 50 శాతం టికెట్లను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీసీ కులాలను అన్ని రాజకీయ పార్టీలు జెండాలు మోసే కులాలుగా చూస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో బీసీలను అణగదొక్కుతున్నారని వాపోయారు. ఈ వైఖరి మార్చుకోవాలని రాజకీయ పార్టీలకు సూచించారు. పక్క రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చూసి బీసీలకు కల్పిస్తున్న అవకాశాలు కల్పించాలని కోరారు. బీసీ జాతీయ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కందనూలు: ఢిల్లీలో బాలిక హత్యకు నిరసనగా గురువారం రాత్రి బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గం సభ్యుడు దిలీప్ చారీ మాట్లాడారు. మతోన్మాద శక్తులు లవ్ జిహాద్ పేరుతో హిందూ బాలికను అత్యంత పాశవికంగా 16 సార్లు పొడిచి చంపిన వ్యక్తిని వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన బాలికకు సంఘీభావం తెలుపుతున్నామన్నారు. కొన్ని శక్తుల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. అంతకు ముందు బీజేపీ జిల్లా కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం బాలిక చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధాకర్ రెడ్డి, కొండ నగేష్, రాము, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోలుకు పడిగాపులు

పెద్దకొత్తపల్లి: యాసంగిలో పండించిన వరిధాన్యాన్ని అమ్ముకోవడం కోసం రైతులు కల్లాల్లో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోకపోవడంతో కాంటా అయినా కూడా కొనుగోలు కేంద్రాల వద్దనే ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దకొత్తపల్లి సింగిల్‌విండో పరిధిలో 10 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 100 లారీలను రైతుల నుంచి కొనుగోలు చేసి తీసుకెళ్లారు. మరో 20 లారీల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దనే ఉన్నాయి. కొత్తపేట సింగిల్‌విండో పరిధిలో 8 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 20 లారీల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మరో 10 లారీల ధాన్యం రైతుల వద్దనే ఉంది. తూకాలైన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకెళ్లేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



సంచుల్లో నింపిన వరిధాన్యం

విద్యార్థుల నమోదు శాతం పెంచాలి

నాగర్‌కర్నూల్: బడిబాట కార్యక్రమం ద్వారా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు సాధించిన ప్రగతి, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, గుణాత్మక విద్య బోధనాంశాలను తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నమోదు శాతాన్ని పెంచాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో బడిబాటపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శనివారం నుంచి 17 వరకు నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. పాఠశాలల ఉపాధ్యాయులను, అధికారులు సంసిద్ధులను చేయడంతోపాటు బడిబయటి పిల్లలను గుర్తించి, బడుల్లో చేర్పించడమే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని గణనీయంగా పెంచాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఏఎస్పీ రామేశ్వర్, డీఈఓ గోవిందరాజులు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి, లేబర్ ఆఫీసర్ ఫసియొద్దీన్, సెక్టోరల్ అధికారులు వెంకటయ్య, నూరుద్దీన్, షర్ఫుద్దీన్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకుందాం..

కల్వకుర్తి రూరల్: మహనీయులను ఎల్లప్పుడు స్మరించుకోవాల్సిన అవసరం ఉందని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రఘుపతిపేట గ్రామపంచాయతీ పరిధిలోని రామగిరిలో గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆయన భూమి పూజలు చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ముచ్చటించారు. ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. సర్పంచ్ రేణుక, నాగరాజు, రవి, భీమయ్య, ప్రభాకర్, బాలస్వామి పాల్గొన్నారు.



పూజ చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

పులకించిన పుడమితల్లి



అరకతో సాలు తోలుతున్న రైతు

అమ్రాబాద్: అదును వర్షం మంగళవారం రాత్రి కురవడంతో భూమితల్లి పులకించిపోయింది. అమ్రాబాద్, పదర మండలాల్లో అదును వర్షం కురవడంతో రెండు మండలాల పరిధిలోని పదర, రాయలగండితండా, జత్యోనాయక్‌తండా, అమ్రాబాద్ మండలంలోని లక్ష్మాపూర్(బీకే), తిర్మలాపూర్ బీకే, కుమ్మరోనిపల్లి, అమ్రాబాద్, ఎమిరెడ్డిపల్లి, ఎల్మపల్లి, జంగంరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో రైతులు రెండు రోజులుగా పత్తి విత్తనాలు వేశారు. రోహిణి కార్తె కావడంతో పంటల దిగుబడి వస్తుందని అదును వర్షం సకాలంలో వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. విత్తనాలను వేసే క్రమంలో ఆయా గ్రామాల పంటపొలాల్లో రైతులు, అరకలు, కూలీలతో భూమితల్లి ఎంతో పులకించిపోయింది.



పంట పొలాల్లో భోజనం చేస్తున్న కూలీలు